# ప్రేమ కథ

– గొగినేని మణి

"ఏమిటీ..!" అంటూ నీలమ్మ కళ్ళు పెద్దవి చేసి చూస్తూ ఆశ్చర్యపోయింది. అది చల్లని సాయంకాలమే అయినా మిట్టమధ్యాహ్నపుటెండ ఆవిడ మొహం పైకే వచ్చింది.

కందగడ్డలా ఎర్రబారిన మొహంతో "నిజమేనా" అంది మళ్ళీ.

గంగిగోవులా ఎదురుగా నిలబడిన శాంతమ్మ తప్పు చేసినదానిలా తలవంచుకునే అవునన్నట్టు తల ఊపుతూ నిస్సహాయంగా నిట్టూర్చింది కూడా. ఆవిడే పెళ్ళికూతురు తల్లి.

నీలమ్మ విసురుగా మాటల తూటాలు వదిలింది. "నా కొడుకు మీ అమ్మాయినే చేసుకుంటానని అనటమే నాకు విడ్డూరంగా అనిపించింది. ఇప్పుడేమో మీ అమ్మాయే ఈ సంబంధం వద్దని చెప్పటం ఇంకా వింతగా ఉంది. తనమెగారి అందచందాలను మెచ్చి ఇంతకన్నా గొప్పవాడు వస్తాడని అనుకుంటోందా ఏమిటీ..!"

అంతలోనే ఎవరూ ఊహించని విధంగా అప్పుడే పెళ్ళిచూపుల తతంగం ముగించిన అమ్మాయి లోపలి గది నుండి వాళ్ళు కూర్చున్న చోటుకు వచ్చి, నీలమ్మ వైపు చూస్తూ దాటిగా చెప్పింది.

"రేపు మమ్మల్ని చూసిన వాళ్ళంతా 'కాకి ముక్కుకు దొండపండు' అనే సామెతను గుర్తుచేసుకుని నవ్వకోకూడదనే నేనీ నిర్ణయం తీసుకున్నాను. 'గంతకు తగ్గ బొంత'లాంటి వాడు నాకు సరిపోతాడు. మీకిప్పుడు అర్థమైందిగా... ఇక మీ కొడుకు ఎందుకు కోరి వచ్చాడో నేనెలా చెప్పగలను... మీరే అడిగి తెలుసుకోండి."

ఆ అమ్మాయి ఆ రెండు మాటలూ చెప్పేసి ఒక్క నిమిషం కూడా ఆగకుండా లోపలకు రివ్వున వెళ్ళిపోయింది.

నీలమ్మ కొడుకు వైపు నిరసనగా చూసి "బాగానే అయిందిగా. ఇక వెళ్దాం పద" అంటూ లేచి నిలబడింది.

అతను తల్లితో "ఒక్క నిమిషం ఉండమ్మా" అంటూ ఆ అమ్మాయి వెళ్ళిపోయిన గది వైపుగా వెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగి వచ్చాడు. చిరునవ్వుతో "ఆ అమ్మాయి పెళ్ళికి అంగీకరించిందమ్మా. ఇక పెళ్ళి ఎప్పుడూ ఎక్కడా లాంటి విషయాలన్నీ మీ పెద్దవాళ్ళు నిదానంగా మాట్లాడుకోవచ్చులే" అన్నాడు.

నీలమ్మ ఓ క్షణం కొడుకు వైపు విచిత్రంగా చూసి, రుసరుసలాడుతూనే కొడుకును అనుస రించింది. ఇంటికి రాగానే "ఆ అమ్మాయికి ఏం చెప్పి ఒప్పించావురా..?" అంటూ నిలదీసింది.

తల్లి కోపం చూసి విశ్వం నవ్వేశాడు. "గంతకు తగ్గ బొంతలా మారటానికి నేను నా రూపురేఖల్ని ఎలా మార్చుకోవాలో చెప్పమని ఆ అమ్మాయినే సలహా అడిగాను. నావైపు ఆశ్చర్యంగా చూసి, 'నేనేదో ఉద్యోగం చేసి బాగా సంపాదిస్తున్నానని అనుకుంటున్నారేమో, నాది చాలా చిన్న ఉద్యోగం' అని, అది కూడా పెళ్ళి తర్వాత మానేస్తానని చెప్పింది. నేను 'నాకేం అభ్యంతరం లేద'న్నాను. ఉద్యోగం చేయటం, మానటం అనేది పూర్తిగా తన ఇష్టమేనని చెప్పేశాను. అప్పుడామ్మాయి 'సరే'నంది."

"అసలా అమ్మాయంటే అంత మోజు ఎందుకు వచ్చిందో అది చెప్పు" అంటూ మళ్ళీ రెట్టించింది నీలమ్మ.

"ప్రేమ... అంతే..!" అనేసి ఊరుకున్నాడు.

ఆవిడకు చిర్రెత్తుకొచ్చినా చేసేదేంలేక మిన్నకుండిపోయింది.

అవతల పెళ్ళికూతురు కాదంబరి తల్లిదండ్రులకూ కూతురి పెళ్ళి విషయం వింతగానే ఉంది. 'మీ అమ్మాయిని చూడటానికి వస్తున్నాం...' అని మధ్యాహ్నం కబురు పంపి, సాయంకాలం వచ్చారు తల్లీ కొడుకు. వాళ్ళు తమకి రెండు వీధుల అవతల ఉంటున్న వాళ్ళేనని వీళ్ళకీ అప్పుడే తెలిసింది. తాము పిల్లకి కట్నం కానుకలంటూ ఏమీ ఇవ్వలేరు. పిల్ల రూపురేఖలు చాలా సాదాసీదాగా ఉంటాయి. చదువుసంధ్యలూ ఎన్నదగినవి కావు. ఏదో షాపులో పని చేస్తోంది. పెళ్ళి కావటం కష్టమేనని అభిప్రాయంతో ఉన్న పిల్ల తల్లిదండ్రులకు ఇలా ఎదురు సంబంధం వెతుక్కుంటూ రావటం విడ్డూరమే అనిపించింది.

వయసుమళ్ళిన వాడెవరో అయి ఉంటాడు. పిల్లని చూడటానికి వచ్చినపుడు కట్నమివ్వలేని తమ స్థితిగతులు తెలుసుకుని వాళ్ళే వెనక్కి వెళ్ళిపోతారని వాళ్ళు ఊహించారు.

అయితే వాళ్ళ అంచనాకి భిన్నంగా అబ్బాయి చిన్నవాడు, అందంగా ఉన్నాడు. మంచి ఉద్యోగమూ ఉందని తెలిసి మరీ ఆశ్చర్యపోయారు.

పెళ్ళి జరిగిపోయింది.

విశ్వం సరదాగా, హుషారుగా ఉన్నాడు పెళ్ళిలో. కానీ నీలమ్మ, పెళ్ళికూతురు కాదంబరి మాత్రం ఆ పెళ్ళికి కారణం తెలియకనేమో ముభావంగా ఉండిపోయారు. విశ్వం వాళ్ళ ఉదాసీనతను గుర్తించాడు కానీ, తను చేయగలిగిందేమీ లేదన్నట్టు మౌనంగానే ఉండిపోయాడు.

కాదంబరి అత్తవారింటికి కాపురానికి వచ్చేసింది. పనులన్నీ సక్రమంగా నిర్వర్తించటం చూసి నీలమ్మ కొంత సంతృప్తి పడింది. తనకి ఆరోగ్యం సరిగా లేనందువలనే ఇలాంటి పనిమంతురాలైన అమ్మాయి అయితే బావుంటుందని కొడుకు అనుకున్నాడేమోనని, పెళ్ళికి కారణం అదే అయుంటుందని ఊహించింది.

అయితే అది నిజం కాదని ఆమెకు తొందరలోనే తెలిసి వచ్చింది.

ఒకరోజు పెరట్లో నుండి నీళ్ళ బిందెతో లోపలికి వస్తూ గడప తగిలి కాదంబరి బోర్లా పడిపోయింది. దాంతో బెడ్‌రెస్ట్ తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

ఏం చేయాలా, ఎవర్ని సాయానికి పిలవాలా అని ఆలోచనలు చేస్తున్న నీలమ్మకు... అంతా తను చూసుకోగలనని భరోసా ఇచ్చాడు విశ్వం. కానీ ఆవిడకు నమ్మకం కుదరక 'నీవల్ల ఏమవుతుందిరా' అంది.

కానీ ఆ మరునాటి నుండీ కొడుకు చేస్తున్న పనులు చూసి ఆవిడ విస్తుపోయింది. తెల్లవారుజామునే లేచి ఇంటి పనులూ, తల్లి సలహాలతో వంటపనులూ పూర్తి చేయడమే కాక కాదంబరికి చేయవలసిన పనులూ చక్కగా చేసేస్తున్నాడు. ఒళ్ళు తుడవడం దగ్గర్నుంచి భోజనం చేయించటం వరకూ కొడుకు చేయడం చూసి నీలమ్మ "ఇలాంటి చాకిరీ చేయాల్సి వచ్చిందేమిట్రా" అంటూ నిట్టూరిస్తే... విశ్వం "బావుందమ్మా. రోజూ మనల్ని కూర్చోబెట్టి అన్ని పనులూ చక్కబెట్టే కాదంబరి కొన్నాళ్ళు మంచం మీద ఉండాల్సి వస్తే ఈ మాత్రం చేయటం కూడా గొప్పేనా..!" అన్నాడు.

ఆ సమాధానం నీలమ్మకే కాదు, కాదంబరికీ విచిత్రంగానే అనిపించింది. ఇప్పుడు ఇంట్లో వాళ్ళు ముగ్గురే కాకుండా ఇంకో చిన్న పిల్లాడూ ఉన్నాడు. ఆ పిల్లాడి పనులన్నీ మంచం మీద నుండే కాదంబరి చెబుతూంటే విశ్వమే తల్లి



సాయంతో చేసేస్తున్నాడు.

అమ్మ విశ్వం పిలుపుతో ఆ ఇంటి అల్లుడు కాంతారావు వీళ్ళింటికి వచ్చాడు. అయిదారేళ్ళ క్రితం విశ్వం అక్కయ్య యాక్సిడెంట్‌లో చనిపోయింది. కాంతారావుకి మళ్ళీ పెళ్ళి చేయాలని అతని పెద్దవాళ్ళు ప్రయత్నాలు చేస్తుంటే... చాలా సంబంధాలు అతని మూడేళ్ళ కొడుకును చూసి వెనక్కి పోయాయట. ఈ విషయం తెలిసిన విశ్వం- అతనిని ఓసారి పిల్లాడిని తీసుకురమ్మని పిలవడం జరిగింది.

అతను వచ్చిన రోజున నీలమ్మ ఎవరో దగ్గరి బంధువులను పిలిపించి, ఆ పిల్లాడి పేరున వాళ్ళకున్న పొలంలో ఎంత పెడతారూ, పోషణ వివరాలూ లాంటివన్నీ మాట్లాడుతోంటే... కాదంబరి వాళ్ళ దగ్గరకు వచ్చి- ముడుచుకుపోయి కూర్చున్న ఆ చిన్న పిల్లాడిని తీసుకుని లోపలకు వెళ్ళబోయింది. నీలమ్మ కాదంబరితో "ఏ విషయమూ తేలకుండానే ఇంట్లోకి తీసుకువెళ్తున్నావ ఎందుకూ..?" అని నిలదీసింది.

"వీడికి వయసులో కావలిసింది అమ్మ లాలన మాత్రమే... అది నేనివ్వగలను. ఇక ఆస్తిపాస్తుల వ్యవహారం మీ పెద్దవాళ్ళు చూసుకోండి. దానితో నాకేం సంబంధం లేదు. పిల్లాడు పెద్దయ్యాక స్వతంత్రంగా బతకగలిగేలా చదువుసంధ్యల బాధ్యత చూసుకుంటే సరిపోతుంది" అని కాదంబరి చెప్పేసింది.

కాంతారావు వెంటనే లేచి నిలబడి "నా పిల్లాడికో బంధం ఏర్పడింది. వాడి గురించి నాకిక దిగులు లేదు. ఇక పొలం ఎంత... ఏమిటీ... అనే విషయాలు పెద్దలు ఎలా అంటే అలాగే చేస్తాను. కాదనేదేం లేదు" అంటూ వెళ్ళిపోయాడు.

అలా వాడి పెంపకం కాదంబరి చేతుల్లోకి వచ్చేసింది.

ఆ రోజు... గదిలో కూర్చున్న తల్లి దగ్గరకు వచ్చి విశ్వం హుషారుగా చెప్పాడు "అమ్మా, రోజూలాగే బుజ్జిని 'అత్త దగ్గర కూర్చో... నిద్ర వస్తే పక్కనే పడుకో' అని చెబుతోంటే, వాడు ఏమన్నాడో తెలుసా... 'అత్త కాదు, అమ్మ' అన్నాడు."

నీలమ్మ కొడుకు వైపు 'అవునా..?' అంటూ ఆశ్చర్యంగా చూసింది. ఆ తర్వాత మెల్లగా అంది "రక్త సంబంధం ఉన్న నాకంటే... ఏ బంధం లేకపోయినా కాదంబరి వాడిని అమ్మలాగే ఆదరంగా చూస్తోంది. నాకదే ఆశ్చర్యంగా, ఆనందంగా ఉంది."

విశ్వం చిరునవ్వుతో "నేనందుకే బావని పిల్లాడిని తీసుకురమ్మని పిలిచాను. ఇలాగే జరుగుతుందని నేనూహించాలే" అన్నాడు.

"నువ్వు ముందే అలా ఎందుకు అనుకున్నావురా..?" అంటూనే కొడుకు వైపు నిశితంగా చూసి "ప్రేమ అని చెప్పి ఊరుకుంటావుగానీ, ఏదో కథ ఉందనిపిస్తోంది. అది చెప్పు" అంది మళ్ళీ కొడుకు చేయి పట్టుకుని లాగి తన పక్కన కూర్చోబెట్టుకుని "చెప్పు..." అంది.

"సరే... చెబుతాలే" అంటూ విశ్వం మొదలుపెట్టాడు.

"ఒకరోజు నా స్నేహితుడిని కలవటానికి వెళ్ళి తిరిగి వస్తూ ఓ పార్కులో కాసేపు విశ్రాంతిగా కూర్చుందామని ఓ సిమెంట్ బెంచీ చూసుకుని కూర్చున్నా. సరిగ్గా ఆ బెంచీకి అటువైపు ముగ్గురమ్మాయిలు కూర్చున్నారు. ఇటువైపు నేనొక్కడినే ఖాళీగా కూర్చోవటం వలన కాబోలు, వాళ్ళ మాటలన్నీ నా చెవినబడ్డాయి.

వాళ్ళ మాటల్నిబట్టి నాకు అర్థమైందేమిటంటే... వాళ్ళు ముగ్గురూ ఒకేచోట ఉద్యోగం చేస్తున్నారు. ఆరోజు- వారానికోసారిగా వాళ్ళు ఓనరు ఇచ్చే జీతం డబ్బునీ, ఆ రోజుకి సెలవునూ తీసుకుని మరోచోట ఇంకో మంచి ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళాలని అనుకున్నారు. వాళ్ళు వస్తున్న దారిలో... ఒక వారగ తుప్పల్లో పడి ఉన్న ఒకావిడను చూశారు. మొహం నిండా రక్త చారికలతో, కొన ఊపిరితో మూలుగుతున్న ఆవిడను చూసిన



వాళ్ళకు ఏం చేయాలో పాలు పోలేదు. ఇద్దరు అమ్మాయిలు వాళ్ళ పనిమీద వాళ్ళు వెళ్ళిపోతే, ఒకమ్మాయి మాత్రం తను వాళ్ళతో రాలేనని చెప్పి, ఆవిడను ఒక ఆటో అతని సాయంతో హాస్పిటల్‌కు తీసుకెళ్ళి చేర్పించి, తన దగ్గరున్న డబ్బుతో మందులు కొనిచ్చి, 'ఆమెకు మెలకువ వచ్చాక, నంబరు తెలుసుకుని వాళ్ళవాళ్ళకు కబురు చేస్తా'మని హాస్పిటల్ వాళ్ళు తెలియజేశాక- వచ్చేసి అక్కడ కూర్చుంది.

'చేతిలో ఉన్నదంతా ఖర్చు చేసి... వాళ్ళ దగ్గర్నుండి వసూలు చేసుకోకుండా వచ్చేశావ్. ఈ వారం అంతా ఎలా?' అని ఓ అమ్మాయి అడిగితే, 'ఏదోలా జరుగుతుందిలెద్దూ. డబ్బుదేం ఉంది... వచ్చేవారం మళ్ళీ అందుతుందిగా. పెద్దావిడ... అందులోనూ మన ఊరి మనిషి అలా పడివుంటే, ఎలా వదిలేసి వెళ్ళగలనూ..?' అని చెప్పింది ఆ అమ్మాయి. 'మన ఊరి మనిషి కాకపోతే వదిలేయొచ్చా..?' అనే ప్రశ్న వచ్చింది. 'అప్పుడు- మన రాష్ట్రానికి చెందినవారేగా అనుకుంటా' అంది జవాబుగా. 'మన రాష్ట్రానికి కాకుండా ఏ ఉత్తరాదివాళ్ళో అయితే పట్టించుకోనక్కర్లేదంటావా' అనే ప్రశ్న మళ్ళీ వచ్చింది. 'అప్పుడు మన దేశస్థురాలే కదా అనుకుంటా' అంది. 'ఏ విదేశస్థురాలో అయితేనో' అనడిగితే, అప్పుడు కూడా 'ఎవరిదైనా ప్రాణమేగా, మనుషులమేగా అనుకుంటా... అంతే' అంటూ నవ్వుతూ వాళ్ళకి జవాబు చెప్పి లేచి నిలబడింది అమ్మాయి. నేనప్పుడు తలతిప్పి చూశాను. ఒకే ఒక సెకనుసేపు చూసినా, చాలా సాదాసీదాగా అనిపించే ఆ అమ్మాయిలో అపూర్వమైన అందం ఏదో నాకు కనిపించింది. ఆ అమ్మాయి మాటల్లో వెల్లివిరిసిన ప్రేమతత్వం, మానవత్వం వలన కాబోలు.

వాళ్ళు వెళ్ళిపోయిన కాసేపటికే హాస్పిటల్ నుండి నాకు ఫోను వచ్చింది. 'మీ అమ్మగారు ఎక్కడికో వెళ్తోంటే, దొంగలెవరో మెడలోని గొలుసు కోసం గాయపరిచి, రోడ్డువార తుప్పల్లోకి లాక్కెళ్ళి పడేసి పోయారు. ఎవరో అమ్మాయి చూసి ఇక్కడ చేర్పించింది. ఇప్పుడే ఆమెకు మెలకువ వచ్చింది...' అని చెప్పారు. పార్కులో- ఆ అమ్మాయిలు మాట్లాడుకున్నది నీ గురించేనని నాకర్థం అయిందప్పుడు.

ఎదురు తిరగటం వలనే అలాంటి అనర్థం జరిగిందని నువ్వు చెప్పావు. తరవాత జరిగింది నీకు తెలిసిందేగా అమ్మా. కొన్నాళ్ళ తర్వాత మనకి దగ్గర్లోనే ఒక వీధిలో ఆ అమ్మాయి కనిపించేసరికి, వెంబడించి అడ్రసు తెలుసుకున్నాను. నీ మొహం నిండా రక్తపు మరకలు ఉండటం వలన నిన్ను చూసి నప్పుడు కాదంబరి గుర్తుపట్టలేదేమో..." అంటూ ముగించాడు విశ్వం.

గుమ్మం దగ్గర్నుండి ఎవరో కదిలి వెళ్ళినట్లనిపించి విశ్వం వెంటనే లేచి వెళ్ళాడు. కాదంబరి మెల్లగా గోడ పట్టుకుని నడవటం చూసి "నువ్వు ఎందుకు లేచావు..?" కినుకగా అడిగాడు.

కాదంబరి అతని వైపు కళ్ళు విప్పార్చి చిరునవ్వుతో చూసింది. మొదటిసారిగా ఆమె మొహం నిండా పరుచుకున్న ఆనందాన్నీ వెలుగునీ చూసి విశ్వం ఆశ్చర్యపోయాడు.

కాదంబరి మెల్లగా అంది. "లేచాను కాబట్టే, నాకూ విషయం తెలిసింది. నాలోని ప్రేమతత్వాన్ని గుర్తించి, గౌరవించిన మీలోని దైవత్వానికి తలవంచి నమస్కరిస్తున్నా" అంటూ భావోద్వేగంతో విశ్వం చేతుల్లో మొహం దాచుకుంది కాదంబరి.

"నీతో కలిసి జీవితం పంచుకోవటం వల్ల నా జీవితం ఆనందంగా గడిచిపోతుందనే స్వార్థమే తప్ప ఇందులో నా గొప్పతనం ఏమీ లేదు" అన్నాడు విశ్వం.

కోడలులోని అందాన్ని మొదటిసారిగా గమనించిన నీలమ్మ ఆనందంగా మనసులోనే వాళ్ళని ఆశీర్వదించింది.

★